ప్రజాశక్తి

మంగళవారం 29 జులై 2025 5

శ్రీ సత్యసాయి



తూముకుంట ఎస్‌బిఐకు కన్నం



తొలగించిన కిటికీ ఇనుప చువ్వలను పరిశీలిస్తున్న క్లూస్‌టీం


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలం తూముకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బిఐ బ్యాంకులో దొంగలు పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి బ్యాంకు వెనుకవైపు కిటికీ గ్రిల్స్‌కు కన్నం వేసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్ల సాయంతో స్ట్రాంగ్ రూమ్, సేఫ్టీ లాకర్లను బద్దలు కొట్టారు. ఉదయం బ్యాంకుకు వెళ్లిన సిబ్బంది దొంగతనం విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బ్యాంకులో ఎంత నగదు, బంగారం అపహరణకు గురైందన్న విషయంపై పోలీసులు, బ్యాంకు అధికారులు గోప్యత పాటిస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని విలేకరులకు తెలిపారు. కాగా జన రద్దీ ఉండే ప్రాంతంలో ఉన్న బ్యాంకులో దొంగతనం జరగడం పోలీసు శాఖ వైఫల్యానికి అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వార్త మెయిన్‌లో..

శింగనమల పంప్డ్ స్టోరేజీ రద్దు!

◆ అరబిందోకు చెందిన సంస్థ వెనుకడుగు

◆ 800 మెగా విద్యుత్ ప్రాజెక్టు ఇక లేనట్టే



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పరిధిలో మంజూరైన పంప్డ్‌స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. చాగళ్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయరుపై దీని నిర్మాణానికి 2022లో వైసిపి ప్రభుత్వం అరబిందో రియాల్టీ, అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు అప్పగించింది. రూ.6వేల కోట్ల పెట్టుబడితో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పరిధిలో 800 మెగావాట్లతోనూ, అవుకు రిజర్వాయరుపైనా మరో 800 మెగావాట్ల సోలార్ పంప్డ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టులో ఎటువంటి కదలికలేకుండా ఉంది.

అరబిందో సంస్థ నుంచి స్పందన లేక రద్దు

శింగనమలకు ఆనుకుని ఉన్న చాగళ్లు రిజర్వాయరుపై పంప్డ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసి పనులను 2022లో అరబిందో సంస్థకు కేటాయించారు. 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో నిర్మాంచాల్సిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు డిపిఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను రూపొందించాల్సి ఉంది. ఈ డిపిఆర్‌ను పరిశీలించే బాధ్యత సాంప్రదాయ ఇంధన వనరుల శాఖ పర్యవేక్షణలో ఆర్వీ ఇంజినీరింగు కన్సల్టెంట్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ డిపిఆర్ తయారీకి అవసరమైన నిధులను అరబిందోసంస్థ సమకూర్చాల్సి ఉంటుంది. అరబిందో సంస్థ డిపిఆర్ తయారీకి సహకరించే సంస్థ అయిన ఆర్వీ సంస్థకు రూ.2.91కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం చెల్లించాలని 2023 నుంచి 2025 ఏప్రిల్ వరకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా అరబిందో సంస్థ నుంచి స్పందన లేదు. దీంతో ఆ సంస్థ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకొచ్చే అవకాశం లేదని భావించి ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. చెల్లింపుల్లో అసాధారణమైె జాప్యం జరిగినందున రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మితిమీరుతున్న వడ్డీవ్యాపారుల ఆగడాలు

◆ దాడులు చేస్తున్నా పట్టించుకోరా..?

◆ ధర్మవరం ఘటనపై కూటమి నాయకులు స్పందించాలి

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్



బాధితుడు రమణతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

చేనేత కేంద్రం ధర్మవరం పట్టణంలో ఓ కుటుంబంపై జరిగిన భౌతిక దాడి అధిక వడ్డీ వ్యాపారుల అకృత్యాలను బహిర్గతం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.రాంభూపాల్ తెలియజేశారు. ధర్మవరం పట్టణం శాంతినగర్‌కు చెందిన చేనేత వ్యాపారి రమణ కుటుంబంపై అధిక వడ్డీ వ్యాపారులు రెండు రోజుల క్రితం దాడికి తెగబడ్డారు. రాత్రి సమయంలో ఇంట్లోకి ప్రవేశించి రమణ, అతని భార్య, పిల్లలపై దాడి చేశారు. దాడి ఘటన సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూడడంతో ధర్మవరంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు బహిర్గతం అయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితుడు రమణ, అతని భార్య భారతి, పిల్లలను సోమవారం నాడు సిపిఎం నాయకులు పరామర్శించారు. అధిక వడ్డీ, కంతుల చెల్లింపు, దాడికి సంబంధించిన అన్ని వివరాలను బాధితుడు, అతని కుటుంబ సభ్యులతో సిపిఎం నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో రాజా అనే వడ్డీ వ్యాపారి వద్ద రమణ రూ.ఆరు లక్షలు అప్పుతీసుకోగా అందుకు వారానికి రూ.10 వడ్డీ చొప్పున రూ.15 లక్షల వరకు వడ్డీ చెల్లించాడని చెప్పారు. తన ఆర్థిక స్థోమత సరిగా లేని కారణంగా ఇక తాను వడ్డీ చెల్లించలేనని అసలు మాత్రమే ఇస్తానని రమణ చెప్పగా రాజా తన అనుచరులతో రాత్రి సమయంలో మూకుమ్మడి దాడి చేయించారని చెప్పారు. రెండు రోజుల క్రితం సోషల్‌మీడియా ద్వారా వెలుగు చూసిన ఈ ఘటన ధర్మవరంలో అధిక వడ్డీ వ్యాపారం ఏ రీతిన జరుగుతోందో తెలియజేస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో వారానికి పది రూపాయల వడ్డీ నడుస్తోందన్నారు. అధిక వడ్డీకి డబ్బులు ఇవ్వడం దానిని చెల్లించని పక్షంలో అప్పుతీసుకున్న వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. వడ్డీ వ్యాపారుల దాడులపై పలుమార్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే పదేపదే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. దాడికి పాల్పడిన అందరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు సిపిఎం వారికి అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పేదలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఉండాలంటే ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా, పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, సిఐటియు నాయకులు జెవి.రమణ, టి.అయుబ్ ఖాన్, ఎల్.ఆదినారాయణ, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి పాల్గొన్నారు.

రైతులకు సమస్యలు లేకుండా చూడాలి

ఇరిగేషన్ అధికారులతో మంత్రి సవిత



పరిగి నాయకులతో సమావేశం అయిన మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ఇరిగేషన్ శాఖ నుంచి రైతులు, ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించే పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీరందించడానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. హంద్రీనీవా కాలువ నుంచి నిర్మించాల్సిన ఫీడర్ ఛానల్‌కు ఎంత నిధులు అవసరమో ప్రణాళిక తయారు చేయాలని హంద్రీనీవా, మైనర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఈలు మురళి, గురుమూర్తి శ్రీనివాసులు, డిఈలు రామసుబ్బయ్య, రేణుకా, ఏఈలు లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, భరత్, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి సవిత సూచించారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆమె పరిగి మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాల గురించి ప్రజలకు వివరించాన్నారు. స్థానికంగా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని మంత్రి దిశా, నిర్దేశం చేశారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఫజులుద్దీన్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆగష్టు 8వ తేదీ వరకూ చెన్నైలో జరిగే 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనబోయే రాష్ట్ర జట్టుకు పట్టణానికి చెందిన ఫజులుద్దీన్ ఎంపికైనట్లు హాకీ ఎపి వైస్ ప్రెసిడెంట్, జిల్లా జనరల్ సెక్రటరీ బి.సూర్యప్రకాష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫజులుద్దీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఇతడి ఎంపిక పట్ల జిల్లా అధ్యక్షులు బివి.శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, ట్రెజరర్ అంజన్న, జాయింట్ సెక్రటరీ అరవింద్‌గౌడ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హస్సేన్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, అమునుద్దీన్, కిరణ్ హర్షం వ్యక్తం చేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజలు అందించే అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను తెలియజేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ సమతా కలిసి 234 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో సంబంధిత అధికారులు ఓవర్ హెడ్ ట్యాంకులను తనిఖీ చేసి శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. విద్యార్థుల వసతి గృహాల్లో శుభ్రత లేకపోయినా కలుషిత తాగునీరు సరఫరా చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్వారీలో విజిలెన్స్ తనిఖీలు

ఐదు గంటల పాటు పరిశీలన



క్వారీలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణ సమీపంలోని సైదాపురం వద్ద క్వారీని మైన్స్ అండ్ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అడ్డదిడ్డంగా క్వారీలో అక్రమంగా తవ్వకాలు జరిగాయని ఆరోపిస్తూ పలువురు విజిలెన్స్ అండ్ మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో పట్టణంలోని సైదాపురం గ్రామ పొలం వద్ద ఉన్న క్వారీలో మైన్స్ అండ్ విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఈ క్వారీ కదిరి మాజీ మున్సిపల్ ఛైర్మన్‌కి చెందినది కావడంతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ తవ్వకాలు చేశారంటూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దీనిపై విచారణకు ఆదేశించారు. అందులో భాగంగా ఏడు నెలల క్రితం భూగర్భ గనులు అధికారులు తనిఖీలు చేసి క్వారీని సీజ్ చేయడంతో పాటు రూ.కోట్ల రూపాయల జరిమానా విధించారు. దీనిపై క్వారీ యజమాని కోర్టుకు వెళ్లి మళ్లీ అనుమతులు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. క్వారీ పున:ప్రారంభించిన తర్వాత కూడా నిబంధనలు పాటించడం లేదంటూ ఫిర్యాదులు వెళ్లాయి. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైన్స్, సర్వే, పొల్యూషన్ శాఖల అధికారులు సంయుక్తంగా క్వారీలో ఐదు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. సంబంధిత యజమానికి కేటాయించిన భూమిలో కాకుండా పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో కూడా త్వకాలు చేసినట్లు తనిఖీ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. తనిఖీ నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామని విజిలెన్స్ సిఐ జమల్‌బాషా తెలిపారు. ఈ తనిఖీల్లో మైన్స్, విజిలెన్స్, ల్యాండ్స్ సర్వే, పొల్యూషన్ శాఖలు అధికారులు పాల్గొన్నారు. కాగ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తమ క్వారీపై అధికారులు తనిఖీలు చేస్తున్నారని క్వారీ యజమాని ప్రణిత్‌రెడ్డి వీడియో ద్వారా తెలియజేశారు.

పట్టణాభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తాం

ఎమ్మెల్యే కందికుంట




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. రూ. 38 లక్షల వ్యయంతో పట్టణంలో ఆరు చోట్ల హైమాస్ లైట్ల ఏర్పాటు పనులకు సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అలాగే పట్టణాభివృద్ధికి సంబంధించి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం కోసం రూ. 5 కోట్లతో అండర్ కేబుల్ వ్యవస్థను అందు బాటు లోకి తీసు కొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కదిరిని టెంపుల్ సర్క్యూట్ కేంద్రంగా తీర్చి దిద్దేందుకు శ్రీకారం చుట్టామని, తద్వారా పర్యాటకుల రాక మరింత పెరిగి వ్యాపారాలు వృద్ధి చెందుతాయన్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా బెంగళూరు వెళ్లే భారీ వాహనాలు బైపాస్ మీదుగా వెళ్లేలా ప్రణాళిక రూపొందించామని, త్వరలో కార్యరూపం దాల్చనుందని తెలిపారు. మదనపల్లి రోడ్డులో కౌలేపల్లి వద్ద భూసేకరణ సమస్యను పరిష్కరించి రోడ్డు పనులు ఆగష్టు నాటికి పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. పట్టణం నలువైపులా శ్మశానవాటికలకు భూమి కేటాయించామన్నారు. పట్టణంలో చోరీలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడానికి రూ. 43 లక్షలతో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబోతు న్నట్లు తెలిపారు. పట్టణ నలువైపులా రైతుబజార్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, ఆర్‌డిఒ వివిఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్, సిఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్



ఫాగింగ్ మిషన్‌లను పరిశీలన చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ ఆదేశాల మేరకు ఆధునిక సాంకేతిక యంత్రాలు, స్ప్రేయర్‌లు మున్సిపాల్టీకి వచ్చాయి. వీటిని మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల నివారణలో భాగంగా అధునాతన సాంకేతికత కలిగిన 15 స్ప్రేయర్లు, రెండు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశామన్నారు. వీటి సహాయంతో మున్సిపల్ పరిధిలోని 38 వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. మరో 15 స్ప్రేయర్లు, రెండు ఫాగింగ్ యంత్రాలు పది రోజుల్లో వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ. శంకర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తున్న తెలుగు తమ్ముళ్లు

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని మహిళలను శారీరకంగా, మానిసికంగా వేధిస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికురాలు ఒక ఆడియోను విడుదల చేసిందన్నారు. ఈ ఆడియోలో కొంతమంది టిడిపి నాయకులు వారి అనుచరులతో పని కావాలంటే పక్కకు రావాలని వేధిస్తున్నారని చెప్పారన్నారు. న్యాయం కోసం ఆ కార్మికురాలు పోలీసులను ఆశ్రయిస్తే ఆమె ఫిర్యాదును సైతం తీసుకోలేదన్నారు. ఇది చాలాదన్నట్లు టిడిపి నాయకులు ఆమెను భయభ్రాంతులకు గురిచేసి, ఊరినే వదిలిపెట్టి పోయే విధంగా చేస్తున్నారన్నారు. మహిళను వేధింపులకు గురి చేసిన వ్యక్తి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరను కలిపి ఫొటో కూడా తీయించుకున్నారని చెప్పారు. ఈ విషయాలన్నీ ఎమ్మెల్యే బాలకష్ణ పీఏలకు తెలియవా అని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు స్పందించకుంటే బాధితురాలి పక్షాన వైసిపి పోరాటం చేస్తుందని తెలియజేశారు.

త్వరలో అన్ని చెరువులకు నీరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుడిబండ

తాలూకాలోని రెండు రిజర్వాయర్లతో పాటు హంద్రీనీవా కాలువను పూర్తి చేసి త్వరలోనే అన్ని చెరువులను నీటితో నింపుతామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రైతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. గుడిబండలో సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో సింగిల్‌విండో అధ్యక్షులుగా మద్దనకుంటప్ప, డైరెక్టర్లుగా ప్రకాష్, సన్నలింగప్ప ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తికి స్థానిక బస్టాండ్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తలు గజమాల వేసి స్వాగతం పలకగా వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ నుంచి సింగిల్‌విండో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. గుండుమల తిప్పే స్వామి మాట్లాడుతూ సింగిల్‌విండో సొసైటీ ద్వారా రైతులు రుణాలు పొంది వాటిని సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలన్నారు. అలాగే రుణాలను సక్రమంగా కంతుల వారీగా చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్‌మూర్తి, నాయకులు వివిఎం. పాండురంగప్ప, సురేష్, మంజునాథ్, లక్ష్మీనారాయణప్ప, నజీర్, ఎంపిటిసి వనజ శశిధర్, తదితరులు పాల్గొన్నారు.



సింగిల్‌విండో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మద్దనకుంటప్ప

'పిఎంజెవై' ద్వారా రూ. 2 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-గాండ్లపెంట

ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన(పిఎంజెవై) పథకం ద్వారా మంజూరైన రూ. 2 లక్షల చెక్కును సోమవారం మండలంలోని రెక్కమాన్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్లు హర్షవర్ధన్, సాయిప్రతాప్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ నారాయణ, వీర మారుతి నామినీ అయిన మాతంగి సుదర్శన్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారురాలు మాతంగి లక్ష్మీదేవి పిఎంజెవై కింద రూ. 436 బీమా చెల్లించిందన్నారు. ఆమె గుండెపోటుతో మృతి చెందగా రూ. 2 లక్షలు మంజూరు కావడంతో నామినీ సుదర్శన్‌కు అందజేశామని తెలిపారు.

రైతులకు 'అన్నదాత సుఖీభవ' అందజేయాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ నిధులు అందజేయాలని కోరుతూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ దేవేందర్ నాయక్ వినతి పత్రం ఇచ్చారు. రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. పరిపాలనలో కూడా విఫలమైందన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎంఐఎం లెవెన్స్ జట్టు

ప్రజాశక్తి-హిందూపురం



విన్నర్స్‌కు కప్‌తో పాటు మెగా చెక్కును అందిస్తున్న ఛైర్మన్

పట్టణం లోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంఐఎం లెవెన్స్ రహమత్‌పురం జట్టు విజేతగా నిలిచింది. ఎంహెచ్ జబీవుల్లా ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుండి క్రికెట్ టోర్నమెంట్‌లో 13 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఎంఐఎం రహమత్ పురం జట్టు, మక్కా హంటర్స్ జట్లు తలపడ్డాయి. ఇందులో ఎంఐఎం లెవెన్స్ రహమత్ పురం జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జెవి.అనిల్ కుమార్ ట్రోఫీతో పాటు రూ. 20వేల నగదు, రన్నరప్‌కు ట్రోఫీ, రూ.10 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, టీడీపీ నాయకులు డైమండ్ బాబా, ఫాజిల్, జబీ, హనీఫ్, సాదిక్, ఆన్సర్, తలహా సమాజ సేవకుడు ఉమర్ ఫరూక్ ఖాన్ పాల్గొన్నారు.

అధిక వడ్డీ పేరుతో దందా చేస్తే రౌడీషీట్ : ఎస్పీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అనధికారికంగా వడ్డీ వ్యాపారాలు చేస్తూ పేదల బలహీనతలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీ వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వి.రత్న సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ధర్మవరంలో ఇటీవల వడ్డీ వ్యాపారులు ఓ ఇంట్లోకి చొరబడి భారతి, రమణ దంపతులపై దాడి చేసిన సంఘటనను ఎస్పీ తీవ్రంగా పరిగణించారు. దీంతో దాడికి పాల్పడిన వారిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్లపై కేసులు నమోదు చేశారు. వారిపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని తెలిపారు. ధర్మవరంలో అనధికారికంగా వడ్డీ వ్యాపారాలు నడుపుతూ వడ్డీ వ్యాపారం ముసుగులో ప్రజలను దోపిడీ చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. అధిక వడ్డీ వ్యాపారుల నుంచి ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించండి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ఫిర్యాదులను పోలీసు అధికారులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ, పోలీసు అధికారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇద్దరు పిల్లలతో కలిసి వేరుగా ఉంటున్న తనను భర్త శంకర్ వేధిస్తున్నాడని, అతడి నుంచి రక్షణ కల్పించాలని కదిరి సమీపంలోని కుటాగుళ్ల గ్రామానికి చెందిన ఎం.మల్లమ్మ మొర పెట్టుకుంది. ఈ విషయంపై పలుమార్లు పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని వాపోయింది. పెనుకొండ మండలంలోని నాగలూరు గ్రామానికి చెందిన శిరీష తన అత్తమామల నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పి-4తో పేద కుటుంబాలకు బంగారు భవిష్యత్తు


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలను గుర్తించి వారిని బంగారు కుటుంబాలుగా మార్చడమే పి-4 లక్ష్యమని ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెడపల్లి గ్రామంలో సోమవారం సర్పంచి మంగ్లీబాయ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపిపి రమణారెడ్డి, ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు విజయకుమార్, మాజీ జడ్పిటిసి శ్రీరామనాయక్, బొమ్మయ్య పాల్గొని ప్రసంగించారు. లబ్ధిదారుల గుర్తింపు, తదితర అంశాలను వివరించారు. మాజీ జడ్పిటిసి శ్రీరామ్‌నాయక్ 12 కుటుంబాలను దత్తకు తీసుకొని వారిని బంగారు కుటుంబాలుగా చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. పలువురు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, బత్తలపల్లి, తండావాసులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మండలంలోని మామిళ్లకుంట క్రాస్‌లో సోమవారం డిటిసిబి సూపర్వైజర్ హబీబ్‌బాషా ఆధ్వర్యం లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గుతో పాటు గళ్ల పడడం, ఛాతిలో నొప్పి, ఉదయం సాయంత్రం జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులు సంప్రదించాలని సూచించారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. వైద్య సేవలు, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తచెరువు పిహెచ్‌సి వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో నీరు వృథా


పైపులైన్‌పగలడంతో వృథా అవుతున్న నీరు

రొద్దం : రొద్దం నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రభుత్వ హైస్కూల్ ముందు తాగునీటి పైపులైన్ రెండు చోట్ల పగిలిపోయింది. దీంతో నిత్యం నీరు లీకవుతూ పాఠశాల ముందు ప్రవహిస్తూ ఉంది. దీంతో రోడ్డు గుంతలయమం కావడంతో పాటు పాదచారులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మ తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

31,1న మంత్రి జిల్లా పర్యటన : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 31, ఆగస్టు 1వ తేదీ జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ టిఎస్.చేతన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ పుట్టపర్తిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, సాయంత్రం ధర్మవరం వెళ్తారన్నారు. ఆగస్టు 1వ తేదీ ధర్మవరంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అదే రోజు సాయంత్రం విజయవాడకు వెళ్తారన్నారు.

తాడిమర్రిలో 'మీ సమస్య-మా బాధ్యత'

తాడిమర్రి : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సోమవారం మండల టిడిపి నాయకులు తాడిమర్రిలో 'మీ సమస్య-మా బాధ్యత" కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రజలు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, ఇళ్ల కోసం అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచి రాము, నాయకులు సాయిప్రసాద్, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

తలుపుల : మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూలర్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ సభ్యుడు మన్సూర్ నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి సమస్య వచ్చినా ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు. రెండు రోజుల క్రితం ఎగువనిగిడిలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కెజిబివిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

కెజిబివి తనిఖీ

నల్లచెరువు : స్థానిక కెజిబివిని సోమవారం ఎంపిడిఒ రఘునాథ గుప్తా, ఏవో రామకృష్ణ సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలన్నారు. స్నాక్స్, ఇతర సౌకర్యాలపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. వారి వెంట ఎస్ఒ శిరీష, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

భర్త ఇంటి వద్ద భార్య నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్


భర్త ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న అనిత

భర్త కాపురానికి పిలుచుకోవడం లేదని అత్తింటి వద్ద భార్య నిరసన చేపట్టిన సంఘటన సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఎనుములపల్లికి చెందిన శ్రీనివాసులు, చిలమత్తూరు మండలంలోని మరు కొత్తపల్లికి చెందిన అనితకు వివాహం జరిగింది. వివాహమైన నెల రోజులకే శ్రీనివాసులు అనితను పుట్టింటికి పంపించేశాడు. ఆ తర్వాత కాపురానికి తీసుకెళ్లలేదు. దీంతో న్యాయం చేయాలని కోరుతూ అనిత వారం రోజుల క్రితం అత్తింటికి వచ్చినా వారు స్పందించలేదు. దీంతో ఆమె ఇంటి వద్దే నిరసన చేపట్టింది. అనిత తండ్రి సూర్యనారాయణ మాట్లాడుతూ నాకు ముగ్గురు కుమార్తెలు అని, పెద్ద కుమార్తె అనితను శ్రీనివాసులు కు ఇచ్చి వివాహం చేశామన్నారు. అయితే భర్త ఆమెను కాపురానికి రానివ్వకపోవడంతో మిగిలిన ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసుకోలేని పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని తండ్రీ కూతుళ్లు కోరారు.

కలెక్టరేట్ వద్ద భారీ పోలీస్ బందోబస్తు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


కలెక్టరేట్ వద్ద బందోబస్తులో పోలీసులు

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ముదిగుబ్బ ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారా యణ యాదవ్ మధ్య నెలకొన్న భూ విభేదాలు కొన్ని రోజులుగా ప్రసార మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని కుల సంఘాలు ఆదినారాయణ యాదవ్‌కు మద్దతుగా సోమవారం చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చాయి. దీంతో కొన్ని దళిత సంఘాలు పల్లెకు మద్దతుగా నిలిచి వారి చలో కలెక్టరేట్‌ను ప్రతిఘటి స్తామని ప్రకటించారు. ఇదిలా ఉండా కలెక్టరేట్ వద్ద ఆందోళనలు, నిరసన కార్యక్రమాలపై ఎస్పీ నిషేధం విధించిన విషయం విదితమే. కలెక్టరేట్ వద్ద ఆందోళనకు ముందస్తు అనుమతి కోసం కుల సంఘాలు, దళిత సంఘాలు చేసుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు డీఎస్పీ విజయ్ కుమార్ ఆయా సంఘాలకు స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించుకోవచ్చని ప్రకటించారు. అయినా ఆయా సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలపడానికి వస్తారనే సమాచారంతో సోమవారం అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. అలాగే కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన ఆయా సంఘాల ప్రతినిధులను ఎక్కడికక్కడ గృహనిర్బంధం, అరెస్టులు చేశారు. గణేష్ కూడలి వద్ద, కర్నాటక నాగేపల్లి రహదారిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఆదినారాయణకు మద్దతుగా గిరిజనులు ఎవరూ పాల్గొనవద్దని రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ఓ ప్రకటన విడుదల చేశారు.


ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్న నాగరాజు

విద్యార్థులకు దుస్తులు అందజేత

హిందూపురం : విద్యార్థులు ఉన్నత ఆశయాలతో విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ముదిరెడ్డిపల్లికి చెందిన రోజా సిల్క్ అధినేత డి.ఎ.నాగరాజు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 60 మంది పేద విద్యార్థులకు నాగరాజు తన సతీమణి సహకారంతో మాదిరి దుస్తులను పంపిణీ చేశారు. ఐదుగురికి అడ్మిషన్ ఫీజులు చెల్లించారు. అనంతరం ప్రిన్సిపల్ అనురాధ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గీత, నాగమణి, ప్రభాకర్, రాజశేఖర్, గోవిందప్ప పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు అభినందనలు

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో అడ్మిషన్లను పెంచడంలో కృషి చేసిన ప్రిన్సిపాల్ అనూరాధను శ్రీ సత్య సాయి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సయ్యద్ మౌలా అభినందించారు. కొత్తచెరువులో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ అడ్మిషన్ల సమీక్షా సమావేశంలో ఆమెను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. గతేడాది కళాశాలలో 333 మంది అడ్మిషన్లు పొందగా ఈ ఏడాది 366 మంది అడ్మిషన్లు పొందారని ఆయన తెలిపారు. కళాశాలలో ప్రభుత్వపరంగా అమలవుతున్న సౌకర్యాల గురించి అటు విద్యార్థినులకు ఇటు తల్లిదండ్రులకు తెలియజేయడంలో ప్రిన్సిపాల్ సఫలీకతులయ్యారని ప్రశంసించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని నారాయణ పాఠశాలల జిల్లా అధికారి రమేష్ బాబు, ప్రిన్సిపాల్ రాజేష్ తెలియజేశారు. సోమవారం స్థానిక నారాయణ పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి నవీన్, అకాడమిక్ డీన్ పరమేష్, వైస్ ప్రిన్సిపాల్ సువర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబాకస్‌లో పురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

అబాకస్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు సిప్ అకాడమీ నిర్వాహకురాలు మాలతి కిషోర్ పేర్కొన్నారు. తమ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 42 మంది విద్యార్థులలో 38 మంది విద్యార్థులు మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు, మెడల్స్ పొందినట్లు ఆమె తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో తమ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన విద్యార్థులను ఆమె అభినందించారు.

పంటల సాగుపై అవగాహన

ఓబుళదేవరచెరువు : మండలంలోని కొండకమర్ల రైతు సేవా కేంద్రంలో సోమవారం డిఆర్‌సి వ్యవసాయ అధికారి చైతన్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, వాటి యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, తదితర అంశా లపై అవగాహన కల్పించారు. డాట్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య మొక్కజొన్న, వరి, వేరుశనగలో వచ్చే తెగుళ్లు, వాటి యాజమాన్య పద్ధతులు, ఎరువులు వాడకం గురించి తెలిపారు. ఏవో ఇలియాజ్ మహ మ్మద్ వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను వివరించారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, ఆంజనేయులు నాయక్, రైతులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌లో స్వచ్ఛ సర్వేక్షన్

ఓబుళదేవరచెరువు : మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో ఉన్న ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ రమణ నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వెలుగు, ఎన్ఆర్ఈజిఎస్, సచివా లయ ఉద్యోగులు సంయుక్తంగా గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మాణిమాల, ఆదిలక్ష్మి, స్వర్ణ, సునీత, లక్ష్మీదేవి, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఎఎస్ఐకు సన్మానం

తలుపుల : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా పని చేస్తున్న కృష్ణారెడ్డి ఇటీవల ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఈయన ఎస్ఐగా నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఎస్ఐ నరసింహుడు మాట్లాడుతూ కృష్ణారెడ్డి విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలతో ఫ్రెండ్లీగా ఉంటూ నిబద్ధతగా పని చేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మస్తాన్, ఈశ్వర్‌నాయక్, తిరుమలేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది

'మా భూములు మాకు ఇప్పించండి'

తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల బైఠాయింపు

ప్రజాశక్తి-సోమందేపల్లి


డిప్యూటీ తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

దశాబ్దాలుగా సాగు చేసుకుంటు న్న వ్యవసాయ భూములకు హక్కు పట్టాలు ఇప్పించాలని పేద, దళిత, బడుగు, బలహీన వర్గాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని తుంగోడు పొలం సర్వే నెంబర్-28లో 1,050 ఎకరాల భూమిలో తుంగోడు, కూగటి మాని పల్లి, చిన్నబాబయ్యపల్లి, కొనతట్టపల్లి గ్రామాల కు చెందిన రైతులు 30 ఏళ్లుగా పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ సిబ్బంది కొలతలు వేస్తుండగా రైతులు అడ్డుకొన్నారు. సోమవారం ఆ నాలుగు గ్రామాల రైతులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రెవెన్యూ అధికారులు కొందరు నాయకుల ప్రమేయంతో పంచాయతీలో తీర్మానం చేసి ఆ భూమి ప్రభుత్వానికి అవసరమని స్వాధీనం చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారని మండిపడ్డారు. అర్హులైన సాగు రైతులందరికీ తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిటి మాట్లాడుతూ ఆ ప్రాంతంలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హద్దులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రామకృష్ణారెడ్డి, అశ్వర్థరెడ్డి, కెవిపిఎస్ వెంకటేష్, బాబయ్య, లక్ష్మీనరసమ్మ, ఆదెప్ప, పెద్దన్న, శివారెడ్డి, నరసమ్మ, రత్నమ్మ, ఓబుళపతి, రంగప్ప, తిప్పన్న, వెంకటేష్, ప్రకాష్, రాజు, సుజాత, గంగాధర్, నాగభూషణ, సుశీల, భాగ్యమ్మ, సావిత్రమ్మ, బావయ్య, రమాదేవి, భాగ్యమ్మ, మంజుల, అంజనమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు చర్చకు వచ్చేనా..?

ప్రజాశక్తి-అమడగూరు

మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాల్సిన మండల సర్వసభ్య సమావేశాలు కేవలం అధికారులు వారి శాఖల నివేదికలు చదివి వినిపించడానికి పరిమితం అవుతున్నాయన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పలు సమస్యలు నెల కొన్నాయి. ప్రధానంగా పలు గ్రామాల్లో ఇళ్లపై ఉన్న 11 కెవి వైర్లను మార్చాలని ఇప్పటికే పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని చెప్పవచ్చు. అలాగే రెవెన్యూ పరంగా సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నా విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు గ్రామ సచివాలయాల్లో రైతులకు అందుబాటులో లేకుండా తహశీల్దార్ కార్యాలయానికే పరిమితం అవుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇక రైతుల కష్టాలను ప్రస్తా వించే వారే కరువయ్యారు. వారికి ప్రభుత్వం రాయితీపై అందించే బిందు సేద్యం పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధర, తదితర అంశాలను సభ్యులు సోమవారం జరిగే సమావేశంలోనైనా లేవనెత్తుతారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి గజ్జల ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని 20 శాఖలకు సంబంధించిన అధికారులు అందరూ తప్పక సమావేశానికి హాజరవ్వాలని ఆయన తెలిపారు.

కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-గాండ్లపెంట


వాటర్ షెడ్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మండలంలోని చామలగొంది పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను రెండో రోజైన సోమవారం కేంద్ర బృందం పరిశీలించింది. నేషనల్ లెవెల్ మానిటరింగ్ బృందం సభ్యులు దయాకర్ రెడ్డి, జిల్లా పిడి విజయప్రసాద్ చెరువుల్లో పూడికతీత, ఫారం పాండ్లు, గుంతలు, పశువుల షెడ్లు, సీసీ రోడ్లతో పాటు హార్టికల్చర్ పనులు, స్వయం సహాయక సంఘాల పని తీరును పరిశీలించారు. భయ్యారెడ్డిపల్లిలో పింఛనుదారులు, మహిళా సంఘాల సభ్యులు, హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడి మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. వారి వెంట సర్పంచి ఎస్.శివప్ప నాయుడు, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, ఎపిఒ చంద్రశేఖర్, పిఆర్ జెఈ రెడ్డి వరప్రసాద్, ఎపిఒ చంద్రశేఖర్, ఎపిఎం సూర్యనారాయణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలో చేపట్టిన వాటర్‌షెడ్ పనులను కేంద్ర బృందం దయాకర్‌రెడ్డి, జిల్లా పిడి విజయ ప్రసాద్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు వాటర్ షెడ్లతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. వారి వెంట ఎపిడి కృష్ణచైతన్య, ప్రాజెక్టు ఆఫీసర్ రవీంద్రారెడ్డి, ఉపాధి సిబ్బంది, రైతులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులుగా రవీంద్రబాబు

కదిరి టౌన్ : తాలూకా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడుగా ప్రముఖ న్యాయవాది పిడుగు రవీంద్రబాబును ఎన్నుకొన్నారు. పట్టణంలోనీ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘం నాయకులు, కార్మికులు సమావేశమయ్యారు. సంఘం తాలూకా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ గౌరవాధ్యక్షులుగా పిడుగు రవీంద్రబాబు, సభ్యులను ఎన్నుకున్నామన్నారు. రవీంద్రబాబు ఎంపికపై భవన నిర్మాణ కార్మికులు, నాయకులు హర్ష వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని ఆర్డీవోకు వినతి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నగర పంచాయతీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన నరసింహారెడ్డి, సూర్యనారాయణరెడ్డి ఆర్‌డిఒ ఆనంద్‌కుమార్‌కు, నగర పంచాయతీ కార్యాలయంలో అధికారికి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతికి వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ కొండాపురం గ్రామ కంఠంలో మా తాత కాలం నుంచి సర్వే నెంబర్-708లోని స్థలంలో అనుభవంలో ఉన్నామన్నారు. దానికి ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే కొందరు తమపై అసత్య ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో విచారించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్, జయరామ్, కృష్ణారెడ్డి, నారాయణప్ప, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. ఈ ఎంపిక పరీక్షను ఎన్‌విఎస్ తరపున సిబిఎస్సి నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 29వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బస్సుల్లో చోరీలపై ప్రయాణికులకు అవగాహన

ప్రజాశక్తి-బత్తలపల్లి

బస్సు ప్రయాణం చేసే సమయంలో తమ విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలపై సోమవారం ఎఎస్ఐ సోమశేఖర్‌మూర్తి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుళ్లు లింగమయ్య, నాగార్జున స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బస్సు కోసం వేచి ఉండే మహిళలు, వృద్ధులు, ప్రయాణికులను అపరిచిత వ్యక్తులు ఏమార్చి వారి నుంచి విలువైన వస్తువులు, సెల్‌ఫోన్, తదితర వాటిని అపహరిస్తారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలు, విద్యార్థినుల పట్ల ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే 100కు ఫోన్ చేయాలన్నారు. దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద, అత్యవసర పరిస్థితుల్లో 100, 108, దిశ యాప్, ఎస్ఓఎస్, ధర్మవరం రూరల్ సిఐ 94407 96832, బత్తలపల్లి ఎస్ఐ 9440796833 నెంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చు అన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మడకశిర

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో సమితి ప్రధాన కార్యదర్శి కె.సోముకుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు రామ్‌కుమార్, ఉపాధ్యక్షులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, ఒపిడి శ్రీనివాసులు, మడకశిర జలసాధన సమితి అధ్యక్షులు ఆనంద రంగారెడ్డి, జివి.ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పెండింగ్ కాలువ పనులు, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బైపాస్ కెనాల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు మొదటి ప్రాధాన్యత కల్పించి మడకశిర చెరువులను నీటితో నింపాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపారు. కార్యక్రమంలో పట్టు రైతుల సంఘం కార్యదర్శి సిద్ధారెడ్డి, రామకృష్ణారెడ్డి, వేమారెడ్డి, పురుషోత్తం, ఉమేష్‌నాయక్, కృష్ణప్ప, సిఐటియు రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి


టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రజలకు ఉపయోగకరమైన పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ నరసింహానాయుడు ఆదేశించారు. స్థానిక టీచర్స్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులను సోమవారం ఎంపిడిఒ నరసింహానాయుడు, డిప్యూటీ ఎంపిడిఒ కృష్ణప్ప, పరిపాలన అధికారి శ్రీనివాసులు, తాడిమర్రి డిప్యూటీ ఎంపిడిఒ రాజశేఖర్‌నాయుడు పర్యవేక్షించారు. ఆయా పనుల వివరాలను కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దారికి అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాన్ని తొలగించాలని కాలనీ వాసులు కోరగా వెంటనే తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ శివయ్యను ఆదేశించారు. వారి వెంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికృప, ఉప సర్పంచి కోటి గోపీనాథ్, టిడిపి నాయకులు సతీష్ కుమార్, శ్రీనివాసులు, రాజు, శివయ్య, వెంకటరాముడు, రామకృష్ణ, ప్రకాష్ ఉన్నారు.


పెద్దిరెడ్డిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

పెద్దిరెడ్డిని కలిసిన డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్

ప్రజాశక్తి-తాడిమర్రి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారు ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై ఆయనతో చర్చించారు. కూటమి ప్రభుత్వం మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసిందని తీవ్రంగా ఖండించారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ (అడ్వకేట్) పేరూరు కురుబ నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వత్థ ఉన్నారు.

మంత్రి సొంత నిధులతో సిమెంటు బెంచీలు ఏర్పాటు

గోరంట్ల : మండలంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు కూర్చోవడానికి మంత్రి సవిత సొంత నిధులతో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. వాటిని స్థానిక టిడిపి నాయకులు పట్టణంలోని బస్టాండ, గుమ్మయ్యగారిపల్లి క్రాస్, వినాయకుని ఆలయం, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు నిమ్మల శ్రీధర్, నరేష్, ఉత్తమరెడ్డి, శ్రీనివాసులు, హరి, రోహిత్, రవి, విక్రమ్, ప్రకాష్ పాల్గొన్నారు.


కొనసాగిన ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అధికారులు జెసిబి సాయంతో చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ సోమవారం కొనసాగింది. గతంలో మార్కింగ్ వేసిన విధంగా ఆక్రమణలను తొలగించారు. ఆర్‌డిఒ సువర్ణ, ఆర్అండ్‌బి ఎస్ఈ సంజీవయ్య పర్యవేక్షణలో స్థానిక పుట్టపర్తి రోడ్డు, పెనుకొండ రోడ్డు, ధర్మవరంరోడ్డులో ఆక్రమణలను తొలగించి వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. కొందరు బిల్డింగ్ యజమానులు తామే తొలగించుకుంటామని కోరగా గడువు లోపు తొలగించుకోవాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలాంజనేయులు, ఆర్ఐ కిరణ్, ఆర్అండ్‌బి జెఈ పొన్నూరుస్వామి, సర్వేయర్ సురేష్, విఆర్ఒ నజీర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, విఆర్ఎలు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థికి వీల్‌ఛైర్ వితరణ

గోరంట్ల : పుట్టుకతోనే పోలియో బారిన పడిన పదో తరగతి విద్యార్థి నాగార్జునకు సోమవారం స్థానిక బాలుర జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఈశ్వర్‌ప్రసాద్ వీల్‌ఛైర్ అందజేశారు. హైదరాబాద్‌లో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థి పూసల వెంకట రమణకు స్నేహితుడి ద్వారా ఈ విద్యార్థి విషయం తెలిసింది. స్పందించిన అతడు వీల్‌ఛైర్ సమకూర్చడంతో హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది సమక్షంలో విద్యార్థి నాగార్జునకు అందజేశారు. వెంకటరమణకు విద్యార్థి, అతడి తల్లిదండ్రులు శాంతమ్మ, నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందనలు తెలిపారు.


విద్యార్థికి వీల్‌ఛైర్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురము జిల్లా మరియు సెషన్సు జడ్జి గారి కోర్టు,
అనంతపురం.
Cr.R.P.No.35/2024

Between:
సి.సుధాకర్ ...వాది
మరియు
ఎన్.శ్రీనివాస బాబు మరియు వగైరా ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి నోటీసు

ఎన్.శ్రీనివాస బాబు S/o సుబ్రమణ్యం,
BHJ గణేష్ మ్యాన్‌ఫ్యాక్చర్స్, డోర్ నెం:13-644,
పి.ఆర్.టి.వీధి, ధర్మవరం టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా.

పై తెలిపిన కేసులో 1వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 05-08-2025వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 05-08-2025న ఉదయం 10:30 గంటలకు పై తెలిపిన కేసులో మీరు స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కానిచో పై కేసును మీ పరోక్షముగా తీర్మానించెదరని తెలియజేయుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎ.నాగార్జున రెడ్డి,
వాదిపరం వకీలు, అనంతపురము.
సెల్ నెం:9440874191